

భూదాన్‌పోచంపల్లిలో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు

# ఉదయం మందకొడిగా.. మధ్యాహ్నం జోరుగా..

- భిన్నంగా సాగిన పోలింగ్ సరళి
- సాయంత్రం తర్వాత కేంద్రాలకు భారీగా బారులు

యాదాద్రి భువనగిరి, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల పోలింగ్ సరళి విభిన్నంగా కొనసాగింది. ఉదయం ఒక తీరుగా.. మధ్యాహ్నం మరో విధంగా పోలింగ్ ప్రక్రియ నడిచింది. ఉదయం పోలింగ్ మందకొడిగా నడిచింది. అనేక చోట్ల సాయంత్రం తర్వాత ఓటర్లు తండోపతండాలుగా తరలివచ్చారు. ఆలేరు, భువనగిరి వరుసగా పరిశీలిస్తే.. ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు 8శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి. 11గంటల వరకు చూస్తే 25.185శాతం, 23.34శాతం నమోదైంది. ఇక మధ్యాహ్నానికి స్పీడ్ పెరిగింది. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఏకంగా 20శాతానికి పైగా పెరిగింది. ఒంటి గంట వరకు 43శాతం, 47శాతం నమోదైంది. మూడు గంటల వరకు 66.71, 61.26శాతం, ఐదు గంటల వరకు ఆలేరులో 81.04, భువనగిరిలో 75.78 శాతం నమోదైంది

**సాయంత్రం తర్వాత బూత్‌లకు క్యూ..** ఇక సాయంత్రం 5గంటల వరకు ఓటర్లు భారీగా పోలింగ్ బూత్‌లకు చేరుకున్నారు. డబ్బులు పంపిణీ చేస్తారేమో అనే ఆశతో సాయంత్రం వరకు పోలింగ్ బూత్‌లకు వెళ్లలేదు. ఒక్కసారిగా 4నుంచి 5గంటల మధ్య పోలింగ్ కేంద్రాలకు బారులుదీరారు. 5.30గంటల వరకు కేంద్రాలకు చేరుకుని క్యూలో నిల్చున్నవారికి ఓటేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. కొన్ని చోట్ల రాత్రి 8 గంటల వరకు ఓటు వేశారు. పోలింగ్ ప్రక్రియ అనంతరం అధికారులు ఈవీఎంలకు సీల్ చేశారు. పోలీసు బందోబస్తు మధ్య భువనగిరిలోని అరోరా కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. ఈ నెల 3న భువనగిరిలో ఓట్ల లెక్కింపు జరుగనుంది.

**పోలింగ్ సరళి ఇలా..(శాతంలో)**

| నియోజకవర్గం | 9గంటలకు | 11వరకు | 1వరకు | 3వరకు | 5వరకు |
|---|---|---|---|---|---|
| ఆలేరు | 8.06 | 25.18 | 43 | 66.71 | 90.05 |
| భువనగిరి | 8.65 | 23.34 | 47 | 61.26 | 89.90 |

# పోలింగ్ 90.03శాతం

**జిల్లాలో సజావుగా ముగిసిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ**

**భువనగిరిలో 89.90, ఆలేరులో 90.05 శాతం**

- ఉదయం నుంచే బారులు తీరిన ఓటర్లు
- మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోటెత్తిన ఓటర్లు
- కొన్నిచోట్ల రాత్రి వరకు కొనసాగిన పోలింగ్
- ఈవీఎంలలో భద్రంగా 40 మంది అభ్యర్థుల భవితవ్యం

యాదాద్రి భువనగిరి, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో గురువారం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కొలనుపాకలో కాంగ్రెస్ గూండాల దాడి మినహా పెద్ద గొడవలు జరుగలేదు. రికార్డు స్థాయిలో ఓటర్లు తమ ఓటును వినియోగించుకున్నారు. 90.03శాతం నమోదైంది. భువనగిరిలో 89.90 శాతం, సాయంత్రం 5గంటల వరకు ఆలేరులో 90.05శాతం ఓట్లు పోలయ్యాయి. ఉదయం 7గంటల నుంచి రాత్రి వరకు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులుదీరారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. పోలింగ్ ముగియడంతో ఈవీఎంలకు సీల్ వేసి అరోరా కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఈ నెల 3న ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగనుంది. భువనగిరి, ఆలేరు రెండు నియోజకవర్గాల్లో 40మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మొత్తం 566 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. భువనగిరిలో 642 బ్యాలెట్ యూనిట్లు, 321కంట్రోల్ యూనిట్లు, 259 వీవీ ప్యాట్లు ఉపయోగించారు. ఇక ఆలేరులో 772 బ్యాలెట్ యూనిట్లు, 386 కంట్రోల్ యూనిట్లు, 432 వీవీప్యాట్లను వినియోగించారు. ఒక్కో కేంద్రంలో మూడు ఈవీఎంలు, ఒక వీవీ ప్యాట్‌ను వినియోగించారు. ఉదయం 5.30గంటలకే ఈవీఎంలు తెరిచి మాక్ పోలింగ్ నిర్వహించారు. ఆయా పార్టీల ఏజెంట్లను అనుమతించారు. మాక్ పో లింగ్ విజయవంతంగా ముగియడంతో ఉదయం 7గంటల నుంచి పోలింగ్ షురూ అయ్యింది.

**పోలింగ్ ఇలా..**

జిల్లాలోని ఆలేరు, భువనగిరి నియోజకవర్గాల్లో 4,50,207 మంది ఓటర్లున్నారు. ఇందులో పురుషులు 2,24,326, మహిళలు 2,25,861 మంది ఉండగా, 20మంది ఇతరులు ఉన్నారు. ఇక భువనగిరిలో మొత్తం 2,16,941 ఓటర్లు ఉండగా, 89.90శాతంతో 1,96,200 ఓట్లు నమోదయ్యాయి. 2018లో ఇక్కడ 90.53 శాతం ఓట్లు పోలయ్యాయి. ఆలేరు నియోజకవర్గంలో 2,33,266మంది ఓటర్లుండగా, ఇందులో 1,16,708మంది పురుషులు, 1,16,539మంది మహిళలు, 19మంది ఇతరులు ఉన్నారు. సాయంత్రం 5గంటల వరకు నియోజకవర్గంలో 90.05 శాతం ఓట్లు నమోదయ్యాయి.

### పటిష్ట బందోబస్తు..

పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు పోలీసులు తమ వంతు కీలక పాత్ర పోషించారు. జిల్లా వ్యాప్తంగా 1400పోలీస్ సిబ్బందితోపాటు కేంద్ర బలగాలు విధులు నిర్వహించాయి. బుధవారం రాత్రే పోలింగ్ స్టేషన్లకు చేరుకున్నారు. పోలింగ్ సమయంలో బయటి వ్యక్తులు రాకుండా చర్యలు తీసుకున్నారు. జాయింట్ సీపీ తరుణ్ జోషి, డీసీపీ రాజేష్ చంద్ర, ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. ఎలాంటి సంఘటనలు జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



భూదాన్‌పోచంపల్లి : దంతూరులో పోలింగ్ సరళిని పరిశీలించిన బీఆర్‌ఎస్ భువనగిరి అభ్యర్థి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి



వలిగొండ పోలింగ్ స్టేషన్‌లో బారులు తీరిన ఓటర్లు

# అంచనాల్లో అభ్యర్థులు

- తమదే విజయం అంటూ అన్ని పార్టీల అభ్యర్థుల ధీమా
- బూత్‌ల వారీగా తమకు వచ్చిన ఓట్లపై లెక్కలు
- ఏయే ప్రాంతాల్లో ఆధిక్యం లభిస్తుందనే అంచనా
- ఎవరికి వారుగా విశ్లేషణలు
- ఆదివారం ఓట్ల లెక్కింపు... మధ్యాహ్నానికే ఫలితాలు

నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. గత ఎన్నికలతో పోలింగ్ శాతాన్ని పోల్చుతూ అందరూ అభ్యర్థులు, జిల్లా జనాలు సైతం ఫలితాలపై అంచనాల్లో మునిగిపోయారు. గత ఎన్నికల్లో మండలాలు, పోలింగ్ బూత్‌ల వారీగా ఎవరికి ఎంత మెజారిటీ వచ్చింది? ప్రస్తుతం ఆయా బూత్‌ల పరిధిలో ప్రభావం చూపగల నాయకులు ఏయే పార్టీల వైపు ఉన్నారు? జనంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల పట్ల ఎంత సానుకూలత ఉంది. ఎంత మంది ప్రజా కూటమి వైపు అనుకూలంగా ఓటేశారు? అనే అంచనాలతో లోతైన విశ్లేషణలు పలువురు చేపడుతున్నారు. ఆది నుంచీ బీఆర్‌ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు జై కొడుతున్న జిల్లా జనం.. అందుకు తగ్గట్టుగానే అనుకూలంగా ఓట్లు వేసినట్లు ఆ పార్టీ నేతలు విశ్లేషణలు చేస్తున్నారు. ఇక పోల్ మేనేజ్‌మెంట్‌లో ఎవ్వరూ సక్సెస్ అయ్యారనేది కూడా ఈ సారి కీలకంగా మారింది. నాన్ లోకల్ ఓటర్లు ఎటు మొగ్గు చూపారూ? స్థానిక ఓటర్ల పరిస్థితి ఏంటన్న కోణంలోనూ విశ్లేషణలు మొదలుపెట్టారు. ఆయా ప్రధాన పార్టీల అభ్యర్థులు సైతం తమదే విజయం అంటూ దగ్గరి వాళ్లతో లెక్కలు సైతం వెల్లడిస్తున్నారు.

**నేడు, రేపు మరింత పెరగనున్న విశ్లేషణలు**

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 12 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. గత ఎన్నికల్లో టీఆర్‌ఎస్ 9, కాంగ్రెస్ 3 స్థానాలను గెలుపొందింది. తరవాత హుజూర్‌నగర్, మునుగోడు ఉప ఎన్నికల్లో ఈ రెండు స్థానాలను కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్ కైవసం చేసుకుంది. ఇక నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య బీఆర్‌ఎస్‌లో చేరడంతో ఉమ్మడి జిల్లాలో అన్ని స్థానాలు బీఆర్‌ఎస్ ఖాతాలోకి వచ్చి చేరాయి. కాగా 2014 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఆరు స్థానాలు, కాంగ్రెస్ ఐదు, ఆ పార్టీ పొత్తులో సీపీఐ ఒక స్థానం గెలుపొందిన విషయం తెలిసిందే. ఈ సారి బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య మెజార్టీ స్థానాల్లో హోరాహోరీ పోరు కనిపించింది. దీంతో ఆయా పార్టీల నేతలు ఎవ్వరికీ వారే తమకు అనుకూలంగా లెక్కలు వేసుకుంటున్నారు. తమ తమ స్థానాల్లో తమదే విజయమంటూ సిట్టింగ్ ఎమ్మెల్యేలు.. తామే గెలుస్తున్నామంటూ వాళ్ల ప్రత్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కౌంటింగ్‌కు ఇంకా రెండు రోజుల సమయం మిగిలి ఉన్నందున... ఇంకా పలు విశ్లేషణలకు, బెట్టింగులకు సైతం అవకాశం పొంచి ఉంది.



భూదాన్‌పోచంపల్లి : అంతమ్మగూడెంలో ఓటు హక్కును వినియోగించుకున్న యువతులు